క్లుప్తంగా

టీబీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



జూలపల్లిలో వైద్యశిబిరం

జూలపల్లి: టీబీ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో శేషయ్య సూరి సూచించారు. పంచాయతీ ఆవరణలో నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు పైబడిన వారికి శనివారం ఉచిత టీబీ పరీక్షలు, డిజిటల్ ఎక్స్‌రే నిర్వహించారు. ప్రత్యేక వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న మనాలిఠాకూర్

రామగుండం: రామునిగుండాల కొండపై శ్రీధ నుర్బాన రామాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 108 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసే ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.

నిత్యావసర వస్తువులు అందజేత



ధర్మారం: బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ముల్కాల బ్రహ్మచారి తల్లి కమల ప్రమాదవశాత్తు మరణించగా.. వారి కుటుంబానికి న్యాయవాది ఆకారి రాజేశం శనివారం నిత్యావసర వస్తువులు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బ్రహ్మచారి కుటుంబానికి తన వంతు సాయంగా ఈ వస్తువులు అందిస్తున్నట్లు రాజేశం తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



రాజేశం(ఫైల్)

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన కోడూరి రాజేశం(35) మద్యం మత్తులో మృతిచెందాడని ఏఎస్సై రామచంద్రం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సౌందర్య(31)ను 2024లో రాజేశం వివాహం చేసుకున్నాడు. 2 నెలలు ఎలిగేడులో నివాసముండి కరీంనగర్‌లో ఇంజపురికాలనీలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. నెల క్రితం పిల్లనిచ్చిన మామ పోతు సత్యనారాయణ మరణించాడు. అక్కడికెళ్లి తాగిన మైకంలో గొడవ చేయగా.. అన్న ఆంజనేయులు రాజేశంను ఎలిగేడుకు తీసుకొచ్చాడు. ఈనెల 3న రాత్రి 10 గంటల సమయంలో తాగేందుకెళ్లి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఎలిగేడు ప్రభుత్వ గొర్రెల ఉన్ని కేంద్రంలో చనిపోయాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో కోఆప్షన్ మాజీ సభ్యుడు..

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఫకీర్ మహ్మద్ (50) అనారోగ్యంతో మృతిచెందాడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచారు. ఫకీర్ మహ్మద్ 2001 నుంచి 2006 వరకు జూలపల్లి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా కొనసాగారు.

వృద్ధురాలు..

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజమ్మ(80) అనే వృద్ధురాలు శనివారం అనారోగ్యంతో మరణించిందని రూరల్ ఎస్సై మల్లేశ్ తెలిపారు. ఈ విషయమై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: అందుగులపల్లి ఫ్లయ్‌ఓవర్ వంతెన వద్ద గతనెల 30న లారీ, బైక్ ఢీకొని పరమేశ్వర్ అనే యువకుడికి గాయాలయ్యాయని ఎస్సై మల్లేశ్ తెలిపారు. పరమేశ్వర్ బంధువు వినయ్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బీసీలకు కేటాయించాలి

సుల్తానాబాద్‌రూరల్: బొంతకుంటపల్లి మూడో వార్డులో ఎస్సీలు లేకున్నా ఎస్సీ జనరల్‌కు కేటాయించారని గ్రామస్తులు ఆరోపించారు. 8 వార్డులు ఉండగా, మూడో వార్డులో 86 మంది ఓటర్లున్నారని, బీసీలు 74 మంది కాగా, ఓసీలు 12 మంది ఉండగా ఎస్సీ జనరల్‌కు కేటాయించడం ఏమిటని ఆసరి రాజయ్య, శ్రీనివాస్, సంపత్, రాజకొంరయ్య, ఉదయ్‌కిరణ్ ప్రశ్నించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఎస్సీలు లేని ఆ వార్డును బీసీకి కేటాయించాలన్నారు.

చి'వరి'కి చేతికందేనా..?



ఖాన్‌సాయిపేట శివారులో మునిగిన వరి



పోతారంలో నీటమునిగిన వరి పంట

- మళ్లీ పెరిగిన గోదావరి వరద నీరు
- పరివాహక ప్రాంతాల్లో మునిగిన పంటలు
- వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

మంథనిరూరల్: ఎగువన కురిసిన భారీ వర్షాలతో గోదావరి నదికి వరద ఉధృతి పెరిగి పంటలను ముంచేస్తోంది. గోదావరి పరివాహక ప్రాంతంలో సాగు చేసిన వరి, పత్తి పంటలు ఈ ఏడాది మూడుసార్లు వరదలో మునిగిపోయాయి. సోమవారం సైతం మరోమారు వరద నీరు పెరిగిపోవడంతో పరివాహక ప్రాంతాలైన పోతారం, ఖానాపూర్, ఎగ్లాస్‌పూర్, ఖాన్‌సాయిపేట, విలోచవరం గ్రామాల్లోని పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వరి పంట మరోసారి నీటిలో మునిగిపోవడంతో చివరికి పంట చేతికస్తుందా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటమునిగిన వరి

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతోంది. 25 రోజుల క్రితం ఇదే తరహాలో వరద నీటితో వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు మునిగిపోయాయి. మళ్లీ వరద ప్రవాహం పెరిగిపోవడంతో వందల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది.

గతంలో 3 రోజులు..

ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాలకు తోడు ఎగువ నుంచి భారీగా వరద నీరు గోదావరి నదిలో చేరడంతో నది ఉధృతంగా ప్రవహించి సమీపంలోని పంట పొలాలను ముంచేసింది. 3 రోజులపాటు వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటిలోనే ఉండిపోయాయి. సుమారు వంద ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా ఎండిపోగా.. మరో వంద ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. అయితే రైతులు వివిధ రకాల మందులు వేసి పంటను కాపాడుకున్నారు. మరోసారి వరద నీరు పంటలను ముంచేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొట్ట దశలో ఉందని మందేస్తే..



నీటమునిగిన వరి పంట కోలుకొని పొట్ట దశకు వచ్చింది. ఈ క్రమంలో మందు వేశా. మళ్లీ వరద నీరు ముంచేయడంతో కొట్టిన మందు గోదావరి నీళ్లపాలైంది. ఈసారి వరి పంట చేతికస్తుందనే నమ్మకం మాత్రం లేకుండా పోయింది.

– దేవేందర్‌రెడ్డి, రైతు, ఖాన్‌సాయిపేట

ఐదెకరాలు నీళ్లలోనే..



ఆగస్టులో వచ్చిన వరదలో మునిగిన వరి పంట మళ్లీ వరదలో మునిగిపోయింది. ఐదెకరాల్లో వరి పంట వేస్తే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ఈ ఏడాది గోదావరి వరద నీటిలో మూడుసార్లు మునిగిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి.

– దానం రాజు, రైతు, పోతారం



జ్యోతినగర్: కుక్కలున్నాయి జాగ్రత్త అని ఇంటి ముందు బోర్డు పెట్టడం పరిపాటే. కుక్కలున్నాయి జాగ్రత్త అని రోడ్డులో బోర్డులు పెట్టే రోజులు వచ్చినట్లుంది ప్రస్తుతం. ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులో పదికి పైగా కుక్కలు రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులతోపాటు పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీవన్ ఎస్‌ఓటూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన కె.చంద్రశేఖర్‌ను శనివారం పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్సనల్ అధికారులు, సిబ్బంది సత్కరించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న సీతారామయ్య

గోదావరిఖని: సంస్థవ్యాప్తంగా జరిగిన 3 ప్రమాదాల్లో గాయపడి హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య శనివారం పరామర్శించారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో గాయపడిన షావల్ ఆపరేటర్ లక్ష్మీనారాయణ, మందమర్రి ఏరియాకు చెందిన జె.రవీందర్, భూపాలపల్లి ఏరియా కేటీకే–6వ గనికి చెందిన గూడెల్లి మొండయ్యను పరామర్శించి యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సింగరేణి డాక్టర్ బాల కోటయ్య ఉన్నారు.

ఇడ్లీ సాంబర్‌లో బొద్దింక



గోదావరిఖని: నిత్యం సింగరేణి కార్మికులకు అందించే అల్పాహారం నాసిరకంగా మారుతోంది. శనివారం సింగరేణి క్యాంటీన్‌లో తయారు చేసిన ఇడ్లీ సాంబర్‌లో బొద్దింక వచ్చింది. దీంతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. పరిసరాలు శుభ్రంగా ఉంచకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాంటీన్ ఇన్‌చార్జి పట్టించుకోవడం లేదని అంటున్నారు.

ప్రతిభ ఉంటే.. ప్రోత్సాహం మీకే..



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

సుల్తానాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పేరుతో ఉపకార వేతనాలను అందిస్తోంది. 8వతరగతి చదువుతున్న వారికి ఉపకార వేతనం పరీక్ష ఎన్‌ఎంఎంఎస్ నిర్వహిస్తుంది. ప్రతిభ చాటితే తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతీ విద్యా సంవత్సరం ఎంపికైన ఒక్కో విద్యార్థికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేలు అందిస్తుంది. ఈవిధంగా ఒక్కో విద్యార్థికి నాలుగేళ్లకు కలిపి మొత్తం రూ.48,000 లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఎన్‌ఎంఎంఎస్ ప్రకటన వెలుబడింది.

అర్హులు వీరే..

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు. ఏడోతరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం వస్తే సరిపోతుంది. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ బడుల విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రూ.100 ఫీజు, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంది. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3లక్షల 50వేలు మించొద్దు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హత గల విద్యార్థులు అక్టోబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 23న ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష విధానం..

ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష మల్టిపుల్ విధానంలో ప్రశ్నలుంటాయి. మెంటల్ ఎబిలిటీ, స్కొలాస్టిక్ ఎలిజిబిలిటీ పరీక్ష 7, 8 తరగతుల సైన్స్, మ్యాథ్స్, సోషల్ సంబంధించిన ప్రశ్నలు వస్తుంటాయి. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా విద్యార్థులను మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేయనున్నారు. అర్హత ఉన్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకొని స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వాటి ఊసే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి తాము శ్రీకారం చుట్టామని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. కాంగ్రెస్ బాకీకార్డు పేరిట బీఆర్‌ఎస్ ప్రత్యేక కార్యక్రమం చేడుతోందన్నారు. దీనిని ప్రతీ కార్యకర్త గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. రాజగృహలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రాజీవ్ యువకిరణాల పేరిట నాలుగుసార్లు దరఖాస్తు తీసుకొని ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలపై నియోజకవర్గ నాయకులతో సమీక్షించారు. ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఘనంగా పూజలు చేశారు. శనివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని ప్రణవం సంస్కృతి సదనం యూత్, హిందూ యువవాహిని యూత్ దుర్గామాతలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఉత్సాహంగా అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్నారు.

నిమజ్జనం..



ఓదెల: కొలనూర్ గ్రామంలో దుర్గామాత నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. స్థానిక శివాలయంలో నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారిని భవాని స్వాములు, భక్తులు శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

అన్నదానం



విజేతకు తాళం అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: పూసాలలో దుర్గామాత నవరాత్రి ముగిసిన తర్వాత ఒడిబియ్యాన్ని వండి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం పుర ప్రముఖులు, భక్తులకు ఒడిబియ్యంతో అన్నదానం నిర్వహించారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి ఎలక్ట్రిక్ స్కూటీ మొదటి బహుమతితోపాటు పలు బహుమతులను మున్సిపల్ కమిషనర్ రమేశ్ అందజేశారు.

మైనార్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా

- 2 నూతన పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్: పేద వర్గాలకు చెందిన మైనార్టీల్లో ఆర్థిక భరోసా నింపేందుకు ప్రభుత్వ 2 పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన, రేవంతన్న కా సహారా మిస్కినో కేలియే పథకాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

మహిళల కోసం..

ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకంలో యోజన ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీల మతాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం రూ.50,000 ఆర్థిక సాయం అందజేస్తుంది. అసహాయ మహిళలు, అనాథలు చిరు వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధి పొందొచ్చు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ఐదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి గతంలో ఆర్థిక సాయం పొందిన వారు ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజనకు అనర్హులు.

అర్హతలివే..

ఈ 2 పథకాలకు సంబంధించిన అర్హులు ఆన్‌లైన్‌లో అక్టోబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇటీవల ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుదారులు 21 నుంచి 55 మధ్య వయసు ఉండాలని సూచించారు. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్, బ్యాంకు అకౌంట్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్, చిరునామా తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుంది.

రూ.లక్ష సాయం

రేవంతన్న కా సహారా మిస్కినో కేలియే పథకంలో భాగంగా ఫకీర్, దూదేకుల, పేద, బలహీన వర్గాలకు చెందిన ముస్లింలకు రూ.లక్ష విలువ చేసే మోపెడ్‌లు, బైకులు, ఈ–బైక్‌లు మంజూరు చేయనున్నారు.

వాహనాల తనిఖీ



జూలపల్లి: మండలంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే సాయంత్రం ఎస్‌ఐ సనత్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలను ముమ్మరం చేశారు. శనివారం పెద్దాపూర్, చొప్పదండి మండలం భూపాలపట్నం మధ్య పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహనాల అనుమతి పత్రాలతోపాటు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాల పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలని సూచించారు.

వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం



మాట్లాడుతున్న భానుచందర్

పాలకుర్తి: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన వక్త విభాగ్ ప్రచారక్ భానుచందర్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం బసంత్‌నగర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోదండ రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా సహ కార్యవాహ ప్రాయకరపు నాగరాజు, దామెర కమలాకర్‌రెడ్డి, గుండా రమేశ్, పాత నాగభూషణం, ఆడెపు రమేశ్, సామాల రవి, పల్లె కుమార్, సంపత్, సాగర్, తిరుమలాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా గుంతలు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లి వెళ్లే రహదారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. అసలే మలుపు. పక్కన సుల్తానాబాద్ రెవెన్యూ శివారులో మానేరు నుంచి వచ్చే మంచినీటి పథకం పైపులైన్ ఉంది. నీరు లీకేజీ కావడంతో గుంత తవ్వారు. ఆ గుంత కూడా పక్కనే ఉండడంతో గుంతల్లో వర్షపు నీరు లీకేజై పైపులైన్‌లోకి వెళ్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైల్వే ట్రాక్ వద్ద ఉన్న భారీ గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.